



ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 286 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 +https:www.prajarepublic.com + వెల - 1/-
ఆదివారం 18 మే 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# ప్లాన్డ్.. ట్రెయిన్డ్.. ఎగ్జిక్యూటెడ్..

# ఆపరేషన్ సిందూర్ పై ఆర్మీ మరో వీడియో

**ఆపరేషన్ సిందూర్ పై భారత సైన్యం మరో వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది.**

దిల్లీ, మే 18, (రిపబ్లిక్ న్యూస్): పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్లోని ఉగ్రస్థావరాలపై భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడులు చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ఇప్పటికే పలు వీడియోలు షేర్ చేసిన భారత సైన్యం.. తాజాగా మరో వీడియోను సోషల్ మీడియాలో పంచుకుంది. వీడియోలో పాక్ లోని ఉగ్రస్థావరాలపై కచ్చితత్వంతో దాడులు చేయడానికి భారత సైన్యం ఎలా ప్రణాళికలు రచించింది, సైనికులకు ఏ విధంగా శిక్షణనిచ్చి.. దాడులను అమలు చేసిందనే విషయాన్ని 'ప్లాన్డ్.. ట్రెయిన్డ్.. ఎగ్జిక్యూటెడ్' కోట్తోతో ఆర్మీ వెస్టన్ కమాండ్ అధికారులు పంచుకున్నారు.



"పహల్గామ్ ఉగ్ర దాడితో దేశ ప్రజలలో ఆక్రోశం లావాలా పొంగింది. ఈసారి పాక్కు తరతరాలు గుర్తించుకునేలా గుణపాఠం నేర్పాలనే ఒకేఒక ఆలోచన సైనికుల మనసులో ఉంది. ఇది ప్రతీకార చర్య కాదు. బాధిత కుటుంబాలకు సైన్యం చేసిన న్యాయం. ఉగ్రవాదులను పోషిస్తున్న పాక్కు తగిన గుణపాఠం" అని వీడియోలో సైనికులు పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ పాక్లోని ఉగ్రస్థావరాలపై మే 7న దాడులు చేసింది. ఆ తర్వాత మే 9 అర్ధరాత్రి, 10వ తేదీన పాకిస్థాన్లోని కీలక వాయుసేన స్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశామని భారత్ ప్రకటించింది. పూర్తి స్వదేశీ ఆయుధాలతో దాడి చేసి 11 వాయుసేన స్థావరాలను దెబ్బతీసినట్లు తెలిపింది.

# గుల్జార్ హౌస్

## ప్రమాద ఘటనకలచివేసింది: మోదీ

**చార్మినార్ పరిధి గుల్జార్హౌస్లో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.**

హైదరాబాద్, మే 18, (రిపబ్లిక్ న్యూస్): చార్మినార్ పరిధి గుల్జార్ హౌస్లో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదంలో పలువురి మృతి కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల పరిహారం అందిస్తామన్నారు. గుల్జార్హౌస్లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 17 మంది మృతి చెందారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులున్నారు. ఆదివారం ఉదయం భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న కొందరిని అగ్నిమాపక సిబ్బంది రక్షించి ఉస్మానియా, యశోద (మలక్పేట), డీఆర్డీవో అపోలో ఆసుపత్రులకు తరలించారు. విద్యుదాఘాతం వల్లే భవనంలో మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం.

### ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

గుల్జార్హౌస్ అగ్నిప్రమాద ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# నేడు చారిత్రక ప్రదేశాలు, మ్యూజియాల్లో ఉచిత ప్రవేశం

ఆదివారం దేశవ్యాప్తంగా చారిత్రక ప్రదేశాలు, మ్యూజియాలలో ప్రజలకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు భారత పురావస్తు సర్వే సంస్థ ప్రకటించింది.

**దిల్లీ, మే 18, (రిపబ్లిక్ న్యూస్): ఆదివారం అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఉన్న అన్ని చారిత్రక ప్రదేశాలు, మ్యూజియాలలో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు భారత పురావస్తు సర్వే సంస్థ ప్రకటించింది.**



దేశ చరిత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి, చరిత్ర గొప్పదనాన్ని తెలియజేయడానికి దేశవ్యాప్తంగా అత్యంత విలువైన పురావస్తు కళాఖండాలు ఉన్న 52 మ్యూజియాల్లో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. తమ పరిధిలో ఉన్న 3,698 చారిత్రక ప్రదేశాల్లోనూ ఈ సౌకర్యం అందిస్తున్నట్లు తెలిపారు. దేశరాజధానిలో ఉన్న తాజ్మహల్, ఎర్రకోట, తెలంగాణలోని చార్మినార్, గోల్కొండ, ఇటీవల వారణాసిలో ప్రారంభించిన మాన్ మహోన్ అబ్జర్వేటరీలోని వర్చువల్ ఎక్స్పీరియన్షియల్ మ్యూజియం వంటి ప్రదేశాలను నేడు ప్రజలు ఉచితంగా సందర్శించవచ్చని అధికారులు తెలిపారు.

# చార్మినార్ పరిధి గుల్జార్ హౌస్లో భారీ అగ్నిప్రమాదం.. 17 మంది మృతి

**నగరంలోని చార్మినార్ పరిధిలోని గుల్జార్ హౌస్లో భారీ అగ్నిప్రమాదం జరిగింది.**

**హైదరాబాద్, మే 18, (రిపబ్లిక్ న్యూస్): నగరంలోని చార్మినార్ పరిధిలో ఘోర విషాదం చోటుచేసుకుంది. చార్మినార్కు సమీపంలోని గుల్జార్ హౌస్లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 17 మంది మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు, నలుగురు మహిళలు ఉన్నారు. ప్రమాదంతో భవనంలో ఉన్న పలువురు ఊపిరి ఆడక స్పృహ కోల్పోయారు. దీంతో వారిని ఉస్మానియా, యశోద (మలక్పేట), డీఆర్డీవో అపోలో ఆస్పత్రులకు తరలించారు.**



కొందరు ఘటనాస్థలంలో.. మరికొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతిచెందారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలానికి అగ్నిమాపక, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ, పోలీసు సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఉన్న మరికొందరిని బయటకు తీసుకొచ్చారు. 10 అగ్నిమాపక యంత్రాలతో సహాయక చర్యలు చేపట్టారు. గుల్జార్ హౌస్ పరిసరాల్లో దట్టంగా పొగ కమ్ముకోవడంతో శ్వాస తీసుకునేందుకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

### మృతుల్లో 8 మంది చిన్నారులే..

ప్రహ్లాద్ (70), మున్ని (70), రాజేందర్ మోదీ (65), సుమిత్ర (60), హమేయ్(7), అభిషేక్ (31), శీతల్ (35), ప్రియాంశ్ (4), ఇరాజ్(2), ఆరుషి (3), రిషభ్ (4), ప్రథమ్ (ఏడాదిన్నర), అనుయాన్ (3), వర్ష (35), పంకజ్(36), రజనీ, (32) ఇద్దు (4)

### సీఎం రేవంత్ దిగ్భ్రాంతి..

అగ్ని ప్రమాద ఘటనపై సీఎం రేవంత్రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో 17 మంది మృతి చెందడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. బాధిత కుటుంబసభ్యులతో రేవంత్ ఫోన్లో మాట్లాడి ఓదార్చారు. మరోవైపు ఘటనా స్థలాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి తదితరులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

### అగ్నిమాపక సిబ్బందికి సరైన శిక్షణ అందించాలి: కిషన్ రెడ్డి

గుల్జార్హౌస్ వద్ద ఘటనాస్థలాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రమాదం జరిగిందని చెప్పారు. సహాయక చర్యల్లో అగ్నిమాపక సిబ్బంది ఆలస్యం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారని తెలిపారు. చిన్న ప్రమాదమే అయినా.. ప్రాణ నష్టం ఎక్కువగా ఉందన్నారు. అగ్నిమాపక సిబ్బందికి ప్రభుత్వం సరైన పరికరాలు, శిక్షణ అందించాల్సి ఉందని చెప్పారు. అగ్నిమాపక శాఖ సాంకేతికతను మెరుగుపరుచుకోవాలని అభిప్రాయపడ్డారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు కేంద్రం తరపున సాయం అందిస్తామని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

# దేశానికి ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశం దక్కింది:పురందేశ్వరి

**ఉగ్రవాదులకు అండగా నిలబడుతూ భారత్ పై విషం చిమ్ముతున్న పాకిస్థాన్ కుతంత్రాలను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన బృందాల్లో ఏపీ భాజపా అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరికి చోటు కల్పించారు.**

రాజమహేంద్రవరం, మే 18, (రిపబ్లిక్ న్యూస్): ఉగ్రవాదులకు అండగా నిలబడుతూ భారత్పై విషం చిమ్ముతున్న పాకిస్థాన్ కుతంత్రాలను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన బృందాల్లో ఏపీ భాజపా అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరికి చోటు కల్పించారు. పహల్గామ్ ఘటన నేపథ్యంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి ప్రపంచదేశాలకు వివరించడానికి భారత్ దౌత్య యుద్ధం ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా 33 దేశాల రాజధానులకు వెళ్లేందుకు వివిధ పార్టీలకు చెందిన మొత్తం 59 మందితో ఏడు అఖిలపక్ష బృందాలను కేంద్రం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా యుకే, ఫ్రాన్స్, జర్మనీ, ఈయూ, ఇటలీ, డెన్మార్క్ దేశాల్లో పర్యటించే ఎనిమిది మంది సభ్యుల బృందంలో ఎంపీ పురందేశ్వరి ఉన్నారు. ఈ బృందానికి భాజపా సీనియర్ నేత, ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నాయకత్వం వహిస్తారు. పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది సామాన్యులు ప్రాణాలు కోల్పోవడం, అందుకు ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్', పాక్ ఆక్రమిత కశ్మీర్ లో ఉగ్రవాదం గురించి వారు వివరిస్తారు. అనేక సంవత్సరాలుగా భారతదేశాన్ని దెబ్బతీసేందుకు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాకిస్థాన్ బుద్ధిని ప్రపంచం ముందు బయటపెట్టడానికి, మనదేశంపై పాకిస్థాన్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎండగట్టడానికి ఏర్పాటుచేసిన అఖిలపక్ష బృందంలో తనకు చోటు దక్కడం ఆనందంగా ఉందని ఎంపీ పురందేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉగ్రవాదులను ఎదుర్కొని ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్లకు, పౌరులకు నివాళులు అర్పించడానికి ఇదొక చిన్న మార్గమని ఆమె పేర్కొన్నారు. దేశానికి ప్రాతినిధ్యం వహించడానికి వచ్చిన అరుదైన అవకాశంగా, గౌరవంగా భావిస్తున్నానని ఆమె చెప్పారు.



# తెదేపా కార్యకర్తపై దాడి..

# వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేశ్ అరెస్టు

**తెదేపా కార్యకర్త ఇసకపల్లి రాజుపై దాడి కేసులో వైకాపా నేత, మాజీ ఎంపీ నందిగం సురేశ్ను పోలీసులు అరెస్టు చేశారు.**

గుంటూరు, మే 18, (రిపబ్లిక్ న్యూస్): తెదేపా కార్యకర్త ఇసకపల్లి రాజుపై దాడి కేసులో వైకాపా నేత, మాజీ ఎంపీ నందిగం సురేశ్ను పోలీసులు అరెస్టు చేశారు. ఆయన్ని తుళ్లూరు పోలీస్ స్టేషన్కు తరలించారు. గుంటూరు జిల్లా ఉద్దండరాయునిపాలెంలో శనివారం రాత్రి రాజుపై.. నందిగం సురేశ్, ఆయన సోదరుడు ప్రభు దాసు, బంధువులు దాడి చేశారు. దాడి ఘటనపై రాజు కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు.. పోలీసులు ఉద్దండరాయునిపాలెం వెళ్లి సురేశ్ను అదుపులోకి తీసుకున్నారు.

### అసలేం జరిగిందంటే..

శనివారం రాత్రి ఉద్దండరాయునిపాలెంలోకి వేగంగా కారు దూసుకొచ్చింది. కారు అతివేగంపై డ్రైవర్ను రాజు మందలించారు. అక్కడికి కాసేపటి తర్వాత సురేశ్ అనుచరులు వచ్చి అతడిపై దాడి చేసి.. సురేశ్ ఇంటికి బలవంతంగా తీసుకెళ్లారు. అక్కడ మరోసారి సురేశ్, అతడి అన్న ప్రభుదాసు, బంధువులు రాజుపై దాడి చేశారు. గాయాలపాలైన రాజుని కుటుంబ సభ్యులు మంగళగిరి ఎయిమ్స్ చేర్చారు. ప్రస్తుతం అతడు చికిత్స పొందుతున్నాడు. మరోవైపు సురేశ్ సోదరుడు, బంధువుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.




printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com


## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1977:** అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం
- **1048:** పర్షియా మహాకవి ఒమర్ ఖయ్యాం ఇరాన్ లోని నైషాపూర్ లో జననం (మ.1131).
- **1804:** ఫ్రెంచి సెనేటు నెపోలియన్ బోనపార్టెను చక్రవర్తిగా ప్రకటించింది.
- **1877:** తెలుగులో మొట్టమొదటి విజ్ఞాన సర్వస్వ నిర్మాత కొమర్రాజు వెంకట లక్ష్మణరావు జననం (మ.1923). (చిత్రంలో)
- **1974:** భారత్ మొట్టమొదటి సారిగా రాజస్థాన్ ఎడారిలోని పోఖ్రాన్ వద్ద అణు పరీక్షలు నిర్వహించింది.
- **1986:** నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు రూపకల్పన చేసిన ప్రముఖ ఇంజనీరు డా.కానూరి లక్ష్మణరావురావు మరణం (జ.1902)
- **2007:** హైదరాబాదు మక్కా మసీదులో బాంబులు పేలాయి.
- **2018:** తెలుగు రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి మరణం (జ. 1940).





అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం



ఒమర్ ఖయ్యాం


నెపోలియన్ బోనపార్టె


కొమర్రాజు వెంకట లక్ష్మణరావు


రాజస్థాన్


డా.కానూరి లక్ష్మణరావు


మక్కా మసీదు


యద్దనపూడి సులోచనారాణి

రిపబ్లిక్ స్పోర్ట్స్

## ప్లేఆఫ్స్ పై దృష్టి.. ఢిల్లీ గేమ్ ప్లాన్ ఛేంజ్.. ఓపెనర్‌గా ఆ బ్యాటర్!

ఢిల్లీ క్యాపిటల్స్.. గుజరాత్ టైటాన్స్ తో నేడు తలపడనుంది. ప్లేఆఫ్స్ రేసులో ఉండాలంటే. ఈ మ్యాచ్ ఢిల్లీకి ఎంతో కీలకం.



ఐపీఎల్ 18వ సీజన్లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు నేడు కీలకమైన మ్యాచ్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉన్న గుజరాత్ ఆ జట్టు ఆదివారం తలపడనుంది. ఈ మ్యాచ్లో విజయం ఢిల్లీకి ఎంతో అవసరం. ప్రస్తుతం ఆ జట్టు ఆరు విజయాలు.. 13 పాయింట్లతో పాయింట్స్ టేబుల్లో ఐదో స్థానంలో ఉంది. ఈ మ్యాచ్లో ఓడితే ప్లేఆఫ్స్ అవకాశాలు మరింత సంక్లిష్టమవుతాయి. దీంతో ఆ జట్టు కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మిగతా మూడు లీగ్ మ్యాచ్లో ఆ జట్టు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఓపెనింగ్ చేయనున్నట్లు సమాచారం. ఆశించిన మేర పరుగులు రాకపోవడంతో.. బ్యాటింగ్ ఆర్డర్లో మార్పులను ఆ జట్టు తీవ్రంగా పరిశీలిస్తోంది. ఇప్పటి వరకూ రాహుల్ ఒక్కసారి మాత్రమే ఓపెనింగ్ చేయగా.. రెండు సార్లు నంబర్ 3లో వచ్చాడు. మిగతా అన్ని మ్యాచ్లో నంబర్ 4 లోనే బ్యాటింగ్ చేశాడు. ప్రస్తుతం ప్లేఆఫ్స్ లో చోటు దక్కించుకోవాలంటే.. టాప్ ఆర్డర్ మెరుగ్గా రాణించాలనీ.. అందుకే కేఎల్ను ముందుకు పంపించాలని జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. పవర్ప్లే అవకాశాలను అతడు చక్కగా ఉపయోగించుకుంటాడని చెబుతున్నారు. మరోవైపు ఢిల్లీ ఇటీవల మ్యాచ్లో పేలవ ప్రదర్శనలతో నిరాశపరుస్తోంది. సన్రైజర్స్‌తో వర్షం కారణంగా రద్దయిన మ్యాచ్లో.. ఢిల్లీ టాప్, మిడిలార్డర్ కుదేలైంది. ఇక ధర్మశాలలో మధ్యలోనే ఆగిపోయిన మ్యాచ్ లో ఢిల్లీ బౌలర్లను.. పంజాబ్ ఓపెనర్లు ఉతికారేశారు. 10.1 ఓవర్లలోనే 122 పరుగులు చేశారు. దీంతో ప్లేఆఫ్స్ వేళ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలపై ఆ జట్టు మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం వచ్చింది. ఇక ఐపీఎల్కు విరామం రావడంతో స్వదేశానికి వెళ్లిపోయిన ఢిల్లీ ప్రధాన పేసర్ మిచెల్ స్టార్క్ తిరిగి భారత్కు రాకూడదని నిర్ణయించుకోవడం ఢిల్లీకి పెద్ద ఎదురుదెబ్బ. ఈ సీజన్లో ఆ జట్టు తరపున ఉత్తమ బౌలర్ స్టార్కే. అతడు 14 వికెట్లు తీశాడు. తాత్కాలికంగా ఐపీఎల్ ఆడే అవకాశాన్ని దక్కించుకున్న బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ ఢిల్లీకి ఎలా ఉపయోగపడతాడో చూడాలి. ఇక ఈ మ్యాచ్లో గుజరాత్ విజయం సాధిస్తే.. అధికారికంగా ప్లేఆఫ్స్ బెర్తు సొంతం చేసుకుంటుంది.

## విడుదలకు సిద్ధమైన సినిమాను ఆపేద్దామన్నారు..

### కానీ: విజయ్ దేవరకొండ

సినిమాకి నేపథ్య సంగీతం ఎంత ముఖ్యమో విజయ్ దేవరకొండ తెలిపారు. స్వీయ అనుభవం పంచుకున్నారు.



తాను నటించిన ఓ సినిమాని విడుదల చేయకుండా ఆపేద్దామని నిర్మాతలు అనుకున్నారని విజయ్ దేవరకొండ తెలిపారు. సంగీత దర్శకుడి మార్పుతో సినిమాపై నమ్మకం కలిగి రిలీజ్ చేసినట్టు చెప్పారు. కొత్త మూవీ 'కింగ్డమ్' ప్రమోషన్స్‌లో భాగంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఆ విషయాలు పంచుకున్నారు. ఆ చిత్రం మరెదో కాదు 'టాక్సీవాలా'. "దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ 'టాక్సీవాలా' స్క్రిప్టు వినిపిస్తున్నప్పుడే బాగా నవ్వుకున్నా. వెంటనే సినిమా చేసేద్దాం అని చెప్పా. ప్రతి సన్నివేశం చిత్రీకరణ పూర్తయ్యాక మానిటర్ అవుట్పుట్ చూసినప్పుడూ నవ్వులే. ఎడిటింగ్ పూర్తయింది. సినిమా విడుదలకు సిద్ధంగా ఉన్న సమయంలో.. నేను చెన్నైలో 'నోటా' మూవీ షూటింగ్లో ఉన్నా. 'టాక్సీవాలా' ఫైనల్ అవుట్పుట్ చూసిన నిర్మాతలు నాకు ఫోన్ చేసి వెంటనే హైదరాబాద్ రమ్మన్నారు. వాళ్ల వాయిస్ ని సీరియస్ నెస్ అర్థమైంది. ఏం జరిగిందోనని టెన్షన్ పడ్డా. హైదరాబాద్ రాగానే అల్లు అరవింద్ గారిని కలిశా. 'ఇది వర్కౌట్ కాదు. ఆపేద్దాం. తదుపరి సినిమాని గ్రాండ్ రిలీజ్ చేద్దాం' అని అన్నారు. నేను షాక్ అయ్యా. మరోసారి చూద్దాం సర్ అని విజ్ఞప్తి చేశా. అలా సినిమా చూసిన నాకూ నవ్వు రాలేదు. సినిమా జానర్కు నేపథ్య సంగీతం పూర్తిభిన్నంగా ఉండడమే దానికి కారణం. 'నేను, దర్శకుడు మరో మ్యూజిక్ డైరెక్టర్ని సెట్ చేస్తాం. సమయం ఇవ్వండి' అని అరవింద్ సర్కి చెప్పా. సంగీత దర్శకుడు జేక్స్ బెజోయ్ని కలిసి సినిమా నేపథ్యం వివరించాం. అతడి నేపథ్య సంగీతం సినిమా విజయానికి కారణమైంది" అని విజయ్ పేర్కొన్నారు.




రిపబ్లిక్ సినిమా CINEMA

## విజయ్ సేతుపతితో విశాల్: ఫొటో షేర్ చేసిన నటుడు



విజయ్ సేతుపతితో తాను కలిసి దిగిన ఫొటోను పంచుకుంటూ విశాల్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "నా స్నేహితుడు విజయ్ సేతుపతిని చాలాకాలం తర్వాత చెన్నై విమానాశ్రయంలో కలిశా. అతడిని ఎప్పుడు కలిసినా ఆనందమే. ఎంతో ఉత్సాహంగా ఉంటాడు. కొన్ని నిమిషాలపాటే మేం మాట్లాడుకున్నా అదెంతో బాగుంది" అని పేర్కొన్నారు. విజయ్ సేతుపతికి ఆల్ ది బెస్ట్ చెప్పిన విశాల్.. ఆ నటుడిని త్వరలోనే మరోసారి కలవాలని ఆకాంక్షించారు. తమిళనాడులోని విల్లుపురం జిల్లా కూవాగంలో కొన్ని రోజుల క్రితం నిర్వహించిన అందాల పోటీల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాల్.. వేదికపైనే స్పృహ తప్పి పడిపోయిన సంగతి తెలిసిందే. ప్రథమ చికిత్స అనంతరం కోలుకున్నారు. ఆ రోజు మధ్యాహ్నం ఆహారం తీసుకోకపోవడమే అందుకు కారణమని ఆయన టీమ్ చెప్పినట్టు కోలీవుడ్లో వార్తలొచ్చాయి. ఆ ఘటన తర్వాత విశాల్ తొలిసారిగా కనిపించడంతో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేశారు. సంక్రాంతికి 'మద గజ రాజ'తో విశాల్ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. సేతుపతి నటించిన 'ఏస్' మూవీ ఈ నెల 23న విడుదల కానుంది. తెలుగులో పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. ఇంకా టైటిల్ ఖరారు కాలేదు.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక
9948814188, 9985876888

ప్రకటన

ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని, అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501

డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001

బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

## ఆరోగ్యం

### కొంతమందికి ఏం తిన్నా ఆహారం జీర్ణమవ్వదు. దీంతో గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. వీటిని నేచురల్‌గానే ఎలా తగ్గించుకోవాలో తెలుసుకోండి.

కొన్నిసార్లు ఊరికే అసిడిటీ వెంటాడుతుంది. ఏం తిన్నా జీర్ణమవ్వదు. దీంతో తినగానే కడుపు నిండుగా అనిపించడం, త్రేన్పులు రావడం, మలబద్ధకం, గ్యాస్‌గా అనిపించడం, ఇబ్బందిగా అనిపించడం వంటివి ఉంటాయి.

దీంతో రెగ్యులర్ వర్క్ చేసుకోలేం. అలాంటప్పుడు చాలా మంది కూడా సమస్యని వెంటనే తగ్గించేందుకు రకరకాల పౌడర్స్ నీటిలో కలిపి తాగడం, సిరప్స్, ట్యాబ్లెట్స్ వాడడం వంటివి చేస్తుంటారు. వీటి వల్ల సమస్య ఏ మాత్రం తగ్గదు. అందుకోసం ఏం చేయాలంటే



### గ్యాస్ పెరిగితే



కడుపులో గ్యాస్ పెరిగితే జీర్ణ వ్యవస్థ అస్తవ్యస్థమవుతుంది. దీంతో కడుపునొప్పి వస్తుంది. ఏదో ఒత్తిడిగా ఇబ్బందిగా ఉంటుంది. మన కడుపులో ఎక్కువగా సాలిడ్స్, లిక్విడ్స్ లేదా గ్యాస్ ఎక్కువగా ఉంటే ఈ సమస్య వస్తుంది. చాలా మంది ఈ సమస్యతో ఎక్కువమంది బాధపడతారు. దీనికి ఇంట్లోనే చెక్ పెట్టొచ్చు.

### కావాల్సిన పదార్థాలు



1 టీ స్పూన్ సీలియం హస్క్(ఇసబ్‌గోల్) ఆయుర్వేద షాపుల్లో, ఆన్‌లైన్‌లో దొరుకుతుంది.

1 గ్లాసు నీరు(200-250 మి.లీ)

2 టేబుల్ స్పూన్ల ఆపిల్ సైడర్ వెనిగర్

### ఎలా ప్రిపేర్ చేయాలి



ముందుగా ఓ గ్లాసు నీటిలో సీలియం హస్క్, ఆపిల్ సైడర్ వెనిగర్ కలిపాలి. బాగా కలపండి. తర్వాత డ్రింక్ తయారైనట్లే. దీనిని తాగండి. మీకు రుచి నచ్చట్లేదనిపిస్తే రెండు స్పూన్ల ఆపిల్ సైడర్ వెనిగర్ బదులు ఒక స్పూన్ ఆపిల్ సైడర్ వెనిగర్ కలపాలి

### ఎప్పుడు తాగాలి



ఇలా తయారైన డ్రింక్‌ని తినడానికి ముందుగా 20, 30 నిమిషాల ముందు తీసుకోవాలి. రెగ్యులర్‌గా తీసుకుంటే మంచి రిజల్ట్స్ ఉంటాయి. ఇక ఇందులో కలిపే ఆపిల్ సైడర్ వెనిగర్ కూడా మదర్ కల్చర్‌ది అయితేనే బాగా వర్కౌట్ అవుతుంది. మదర్ కల్చర్ ఆపిల్ సైడర్ వెనిగర్ అయితే కడుపులో మంచి బ్యాక్టీరియాని పెంచుతుంది.


### ఎలా పనిచేస్తుంది



ఈ డ్రింక్ తాగితే బ్లోటింగ్ తగ్గుతుంది. కడుపులో గ్యాస్ దూరమవుతుంది. తిన్న ఆహారం సరిగా జీర్ణమవుతుంది. ఈ డ్రింక్ గట్ హెల్త్‌కి చాలా మంచిది. రెగ్యులర్‌గా రోజుకి రెండు సార్లు తాగడం మంచిది. కావాలనుకుంటే కొద్దిగా దాల్చిన చెక్క పొడి కలపాలి. దీని వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ కూడా తగ్గుతాయి.



### ముఖ్యంగా



ఇది నేచురల్‌గా తయారుచేసిన డ్రింకే అయినప్పటికీ.. అందరికీ పడకపోవచ్చు. కారణం అందరి శరీరతత్వాలు డిఫరెంట్‌గా ఉంటాయి. కాబట్టి, తాగినప్పుడు మీకు ఏదైనా ఇబ్బందిగా ఉంటే రెగ్యులర్‌గా కాకుండా వారానికి రెండు సార్లు తాగడం అలవాటు చేసుకోండి. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం నుంచి రిలీఫ్ ఉంటుంది.